క్లుప్తంగా

జరిమానా రద్దు చేయాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు అనారోగ్యంతో విధులకు గైర్హాజరైతే యాజమాన్యం కాంట్రాక్టర్ల ద్వారా విధిస్తున్న అమానవీయ పెనాల్టీని రద్దు చేయాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాజర్‌పాషా డిమాండ్ చేశారు. శనివారం ఏరియాలోని కొండాపురం సీఎస్‌పీలో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనారోగ్యానికి గురై లేదా అత్యవసర పని మీద విధులకు గైర్హాజరు అయితే జీతాన్ని కోల్పోవడంతో పాటు యాజమాన్యానికి తిరిగి పెనాల్టీని కాంట్రాక్టర్ ద్వారా ఎదురు చెల్లించాలనే నిబంధనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రచార కరపత్రాలను కాంట్రాక్ట్ వర్కర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, అంగోత్ మంగీలాల్, పీడీఎస్‌యూ దుర్గం ప్రణయ్, సాధనపల్లి రవి, పెనుగొండ నాగార్జున, వెంకటేశ్వర్లు, భద్రం, నగేశ్, సంజీవరావు, లక్ష్మీనారాయణ, పిచ్చయ్య, లింగయ్య, కృష్ణ, అరుణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆయా లేక అవస్థలు..



చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న అంగన్‌వాడీ టీచర్ అరుణ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు ఎంతో కాలంగా భర్తీ చేయడం లేదు. దీంతో ఆయా పనిభారమంతా అక్కడి టీచర్‌పైనే పడుతోంది. అంగన్‌వాడీ టీచర్ ఆర్.అరుణ పిల్లలకు పాఠాలు చెబుతూ మరోపక్క వారికి వంట తయారు చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితి ఉన్నా ఆరోగ్యం బాలేకపోయినా సెలవు పెట్టే పరిస్థితి లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఆయా పోస్టును భర్తీ చేయాలని ఎంతో కాలంగా కోరుతున్నా అధికారులు స్పందించటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



ఎమ్మెల్సీ కవితతో సాయి తదితరులు

ములకలపల్లి: జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఖమ్మం వచ్చిన కవితను కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. కవితను కలిసిన వారిలో మాజీ జెడ్పీటీసీ సున్నం బాబూరావు, మాజీ సర్పంచ్ సున్నం సుశీల, నాయకులు శనగపాటి సీతారాములు, పుష్పాల చందర్‌రావు, వడ్డె హన్మంతరావు, పుష్పాల సాయి తదితరులు ఉన్నారు.

'విద్యార్థుల సమస్యలను పట్టించుకోని పాలకులు'

చంద్రుగొండ: విద్యారంగంపై పాలకులు శీతకన్ను చూపుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ విమర్శించారు. మండలకేంద్రం చంద్రుగొండలోని వివిధ వసతి గృహాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలతోపాటు కేజీబీవీ విద్యాలయంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో కోతుల బెడదను నివారించాలన్నారు.

'సెలవు సరికాదు'

కరకగూడెం: బంజారాల ఆరాధ్య దైవం 'సంత్ సేవాలాల్ మహారాజ్'జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం లంబాడీలకు ప్రత్యేకమైన సెలవు ఇవ్వడం సరికాదని ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడు పోలెబోయిన వెంకటనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రలో బీసీలుగా ఉన్న లంబాడీలు తెలంగాణ రాష్ట్రంలో ఎస్టీలుగా ఉండి అక్రమంగా రిజర్వేషన్లు పొందుతున్నారని అన్నారు. వారి ఉనికి కోసం వివిధ రకాలైన దేవతలను ప్రజల ముందుకు తెచ్చి పబ్బంగడుపుతున్నారని విమర్శించారు. మండల ఆదివాసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి కలం సాంబమూర్తి, కమిటీ సభ్యులు పోలెబోయిన కార్తీక్, కలం నాగకృష్ణ, కలం సంపత్, పోలెబోయిన రాజు, సుతారి నాగేశ్వరరావు, ఊకే నరేష్, చందా అశోక్, సత్యనారాయణ, సాంబశివరావు, కృష్ణ పాల్గొన్నారు.



పెద్దూరులో రెక్కల రామక్క జాతరకు సిద్ధమవుతున్న ఆలయ పరిసరాలు





గద్దెలపైకి చేరుకుంటున్న పగిడిద్దరాజు, సమ్మక్క దేవతలు (ఫైల్)

వరుసగా జాతరలే..

- రానున్న రోజుల్లో ఆదివాసీల ఇలవేల్పుల వేడుకలు
- పల్లెపల్లెనా పండుగ వాతావరణం
- సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా కార్యక్రమాలు

ఆదివాసీలు సంస్కృతి.. సాంప్రదాయాలతో నిత్యం జరుపుకునే భూమి పండుగ.. విత్తనాల పండుగ.. కొత్తపొడి వేడుకలు ఓ వైపు. ఏడాదికోసారి జరుపుకునే ఇలవేల్పుల జాతరలు మరో వైపు గిరిజన గ్రామాల్లో సందడి చేయనున్నాయి. ఈ జాతర వేడకలకు తోటి వంశీయులతో పాటు, బంధువులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే జనంతో ఏజెన్సీ పోటెత్తనుంది. మూడు రోజుల నుంచి ఐదు రోజుల పాటు గ్రామాల్లో జరిగే జాతరల సందడితో నలుమూలలా పండగ వాతావరణం తలపించనుంది.

గుండాల: మండలంలోని ఆయా ప్రాంతాల్లో జరిగే జాతరలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరపనున్నారు. ప్రత్యేక పూజలతో వడ్డెలు, తలపతులు, పూజారుల ఆధ్వర్యంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలతో వీటిని నిర్వహిస్తారు.

ప్రతీ జాతరకు ప్రత్యేక పూజారులు..

మండలంలో జరిగే ఈ జాతర్లకు వడ్డె, తలపతి, పూజారులు ఉంటారు. ఆయా ఇలవేల్పులను కొలిచే క్రమంలో వారంతా ఒక్కపొద్దులతో ఉంటారు. గుడిమెలుగుట, మండల మెలుగుట, గుట్ట నుంచి దేవుడిని తీసుకురావడం, గంగాస్నానం చేయించడం, జోగుకు వెళ్లడం, గద్దెలపై (గుడిలో) ప్రతిష్ఠించడంతో ప్రత్యేక పూజలు చేస్తారు. ఆదివాసీ, సంస్కృతి, సాంప్రదాయాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

నృత్యాలు.. పూనకాలు..

ఇక ఆయా జాతరలో దేవుడిని తీసుకు వచ్చే క్రమంలో డోళీ చప్పుళ్లకు మహిళలు పూనకాలతో, చిన్నారులు నృత్యాలు చేస్తారు. ప్రతీ ఏడాది మార్చిలో జరిగే ఇలవేల్పుల జాతర అత్యంత వైభవంగా జరుగుతుంది. క్రీడా పోటీలు సైతం నిర్వహిస్తారు. జాతరలో భారీగా దుఖాణాలు వెలుస్తాయి. ఈ జాతర్లకు చుట్టుపక్కల మండలాలతో పాటు, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి జనం అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఈ నెల రోజుల పాటు జాతరలు పండుగ వాతావరణాన్ని తలపిస్తాయి.



యాపలగడ్డ వద్ద పగిడిద్ద రాజు జాతరలో ఎదుర్కోలు దృశ్యం (ఫైల్)

సండే స్పెషల్

మండలంలో జరగబోవు జాతరలు ఇవే..

- మేడారం సమ్మక్క భర్త, అరెం వంశీయుడైన పగిడిద్ద రాజు జాతరను మేడారం జాతర అనంతరం యాపలగడ్డలో నాగవెల్లి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మార్చి మొదటి బుధ, గురు, శుక్ర వారాల్లో ఈ జాతర జరుగుతుంది.
- రోళ్లగడ్డ ఈసం వంశీయుల ఇలవేల్పు దూలగొండ ముసలమ్మ జాతరను ప్రతీ ఏడాది హోలీ పండుగ అనంతరం నిర్వహిస్తారు. హోలీ తర్వాత వచ్చే మొదటి బుధ, గురు, శుక్ర వారాల్లో జరుగుతుంది.
- శంభూనిగూడెంలో కుంజ వంశీయుల ఇలవేల్పు అయిన సూరపాపయ్య జాతర ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరుగుతుంది. సూరపాపయ్య దేవుడు మహబూబాబాద్ జిల్లా పాఖాల కొత్తగూడెం మండలం గుంజేడు ముసలమ్మ (దేవత) కొడుకు. అయితే కుంజ వంశీయులు ఇలవేల్పుగా వారు ఈ జాతర నిర్వహిస్తారు.
- మేడారం సమ్మక్క భర్త పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజు. చెట్టుపల్లిలో సనప వంశీయులు (4వ గట్టు) ఇలవేల్పుగా కొలుస్తారు. ప్రతీ ఏడాది మేడారం జాతర అనంతరం చెట్టుపల్లిలో మూడు రోజుల పాటు ఈ గోవిందరాజు జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.
- మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ (దేవత)ను మోకాళ్ల వంశీయులు ఇలవేల్పుగా కొలుస్తారు. దీనిలో భాగంగానే ప్రతీ ఏడాది ముత్తాపురంలో ములసమ్మ జాతరను రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.
- ప్రతీ ఇంట్లో కొలిచే లక్ష్మీదేవిని ఆదివాసీలైన జోగ వంశీయులు తమ ఇలవేల్పుగా కొలుస్తారు. తూరుబాక గ్రామంలో జోగ వంశీయులు గుడి నిర్మించి ప్రతీ ఏడాది మార్చి నెల మొదటి గురు, శుక్ర, శని వారాల్లో లక్ష్మీదేవి జాతరను నిర్వహిస్తూ వస్తున్నారు.
- ఆళ్లపల్లి మండలం పెద్దూరు గ్రామానికి చెందిన కొమరం వంశీయులు రెక్కల రామక్కను ఇలవేల్పుగా కొలుస్తున్నారు. నల్లనువ్వుల మండిలో దొరికిన రెక్క(పావురం, విమానం రూపం)తో కొమరం వంశీయులలో ఒకరికి వచ్చిన పూనకంలో కొమరం ఇలవేల్పును ప్రతీ ఏడాది జాతర నిర్వహించాలని తెలిపింది. దీంతో ప్రతీ ఏడాదిలో భాగంగానే ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు పెద్దూరులో రెక్కల రామక్క జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జాతర ఐదు రోజుల పాటు జరగనుంది.
- నడిమిగూడెం గ్రామనికి చెందిన పాయం వంశీయుల ఇలవేల్పు అయిన రణాసురుడి జాతరను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. ఓ చెట్టు రంధ్రంలో (బాణం రూపంలో) వెలసిని క్రమంలో ఆ ఇలవేల్పు భగభగ మండే సూర్యుడిలా కనిపించడంతో ఆ ఇలవెల్పు పేరును రణాసూరుడుగా కొలుస్తున్నారు. ఆ భక్తిపారవశ్యంతో జాతరను నిర్వహిస్తారు.

పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు

చర్ల: మండలంలోని ఉంజుపల్లిలో గిరిజనులకు సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. సత్యనారాయణపురంలోని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ కమాండెంట్ మనీష్ కుమార్ మీనా నేతృత్వంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భారత్ ఫౌండేషన్ సొసైటీకి చెందిన ట్రైనర్ ఎస్.స్వాతి పుట్ట గొడుగుల పెంపకం, వాటి మార్కెట్‌కు ఎగుమతి చేయడం, వాటి ద్వారా వచ్చే లాభాల గురించి గిరిజనులకు వివరించారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ కామాండెంట్ మనీష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. గిరిజనులను ఆర్థికంగా బలపరిచేందుకే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉంజుపల్లి క్యాంప్ అసిస్టెంట్ కమాండెంట్ ఆర్ఎస్ తోమర్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, ఉంజుపల్లి, వద్దిపేట గ్రామాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం



అశ్వారావుపేటరూరల్: బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న సంఘం అధ్యక్షుడు నాగబాబు



దుమ్ముగూడెం: ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినీల్

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఏఎమ్‌సీ కాలనీలో నిరుపేద కుటుంబాలకు దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా కమిటీ సభ్యురాలు పూజల లక్ష్మి మాట్లాడుతూ.. సంస్థ జాతీయ అధ్యక్షుడు బీవీ రాజు ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలకు యువతకు జరిగే అన్యాయాలపై నిరంతరం పోరాటాలు నిర్వహించడమే కాకుండా సంక్రాంతి, దసరా ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక, క్రీడా పోటీలను నిర్వహిస్తూ విజేతలకు బహుమతులు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరు కుటుంబాలకు నిత్యవసర వస్తువులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులను అందించామని తెలిపారు. దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు..

దుమ్ముగూడెం: పెద్దనల్లబల్లి అగ్నిప్రమాద బాధిత రెండు కుటుంబాలకు పీవీ చారిటబుల్ ట్రస్ట్ విజయవాడ వాస్తవ్యులు తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశారు. ఆ నగదును దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ చేతులు మీదుగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మీడియా-కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ కనుబుద్ది దేవా, మండల ఉపాధ్యక్షుడు, తెల్లం హరికృష్ణ, మాజీ సర్పంచ్ మట్టా శివాజీ, మండల యూత్ ప్రెసిడెంట్ సిద్ది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు..

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిరుపేద బాధిత కుటుంబానికి శనివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నగదు అందించారు. పట్టణంలోని చిన్నంశెట్టి బజార్‌కు చెందిన మన్యం శివ ఇటీవలె ఏపీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలయ్యాయి. వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న తెలుసుకున్న మున్నూరు కాపు సంఘంతోపాటు వాట్సాప్ గ్రూపుల ద్వారా దాతల నుంచి సేకరించిన రూ.50వేల నగదును బాధిత కుటుంబానికి సంఘం అధ్యక్షుడు కురిశెట్టి నాగబాబు చేతుల మీదుగా అందించారు. సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, చిక్కం గోపాలకృష్ణ, టి.అప్పారావు, పి.రామస్వామి, కె.శ్రీను, నాగేశ్వరరావు, సంజయ్, రఘురాం, సాయి, ఉపేంద్రరావు పాల్గొన్నారు.

జేఈఈలో సత్తా చాటిన మండల విద్యార్థి



కుర్సం గిరిధర్

దమ్మపేట: మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. బాలరాజు గూడెం గ్రామానికి చెందిన కుర్సం గిరిధర్ ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98.66 పర్సంటైల్ సాధించి, పలువురి మన్ననలు అందుకున్నాడు. ఈ సందర్భంగా గిరిధర్‌ను గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు తదితరులు అభినందించి, రాబోయే జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఇంకా ఉన్నతమైన ర్యాంకును సాధించాలని ఆకాంక్షించారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వెంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు, ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో కొత్తగూడెంకు చెందిన గమ్యం వంశీకృష్ణ, సోనిక దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. మేనేజర్ పీవీ రమణ పర్యవేక్షించారు.

17న నెల్లిపాకలో..

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత అభినవ వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం ఈ నెల 17న వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 15, 16 తేదీలలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు 17న కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మవారికి నిత్య పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులోని కట్టమైసమ్మ తల్లి ఆలయంలో జాతర ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారికి నిత్య పూజలు చేశారు. జాతర ఉత్సవాలు ఐదో రోజుకు చేరగా.. శనివారం ఉదయం ఆలయం వద్ద సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. అమ్మవారికి వివిధ రకాల పూజలు చేయగా, భక్తులు దర్శించుకున్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ నిశాంత్ రావు

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నిశాంత్‌రావు శనివారం సందర్శించి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ వంటి వాటితో బాధపడుతున్న వారిని గుర్తించాలని, వారిపేర్లను ఆన్‌లైన్ చేసి ప్రతీ నెలా వారికి అవసరమైన మందులను అందజేయాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన విప్పలగుంపులో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. వ్యాక్సిన్‌ను సరైన సమయంలో సరైన టీకాలను వేయడంతో పాటు తదుపరి వ్యాక్సిన్ తేదీని కూడా గుర్తు చేయాలని సూచించారు. ఏఈఎఫ్‌ఐ కిట్‌లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, సుజాత, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో నమోదు కానీ కుటుంబాల కోసం మరోమారు నిర్వహిస్తున్న సర్వే అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మూడు విధాలుగా ఈ సర్వేను చేపట్టి వివరాలను నమోదు చేసుకోనున్నట్లు తెలిపారు. 040-21111111 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు కాల్ చేసి కానీ, మండల, మున్సిపాలిటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన పౌర సేవా కేంద్రాల ద్వారా కానీ, వెబ్ సైట్ ద్వారా ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసి పూర్తి చేసి ప్రజాపాలన సేవా కేంద్రాల వద్ద సమర్పించాలని తెలిపారు.

ఈ అవకాశాన్ని గత సర్వేలో నమోదు చేసుకోని ప్రతీ ఒక్క కుటుంబం సద్వినియోగించుకోవాలని కోరారు.

వనంలోకి సమ్మక్క- సారలమ్మ



కరకగూడెం: వన దేవతలను తీసుకెళ్తున్న గిరిజనులు

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి అటవీప్రాంతంలో ఉన్న సమ్మక్క సారాలమ్మ జాతర శనివారం ముగిసింది. ఆదివాసీల ఆరాధ్య దైవమైన దేవతల జాతర నాలుగు రోజులపాటు ఘనంగా సాగింది. వేలాదిమంది భక్తులు దేవతలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివాసీ పూజారి భక్తానంద మడివి బాబురావుస్వామి ఆధ్వర్యంలో సాంప్రదాయంగా దేవతామూర్తులకు పూజలు జరిపించారు. జాతర ముగియడంతో సమ్మక్క సారాలమ్మలను వనానికి భక్తిశ్రద్ధలతో సాగనంపారు. కమిటీ బాధ్యులు మల్లం కృష్ణయ్య, బొర్రా సురేష్, ఈసం నాగభూషణం, మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన చిరుమళ్ల జాతర..

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల గ్రామంలో ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన సమ్మక్క, సారలమ్మ జాతర శనివారం ఘనంగా ముగిసింది. వేలాది మంది భక్తులు వన దేవతలను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

జాతర ముగింపు సందర్భంగా వన దేవతలను వనంలోకి ప్రవేశపెట్టే కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వన దేవతలను వనంలోకి తీసుకెళ్లారు. భక్తులు అంతిమంగా దర్శించుకుని, వీడ్కోలు పలికారు. అలాగే వనంలోకి వెళ్లే దారిలో దేవతలకు పూజలు చేస్తూ, పాటలు పాడుతూ వెళ్లారు. ఈ జాతరలో గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, సంగీత కార్యక్రమాలు కూడా జరిగాయి. ఇవి జాతరకు మరింత వైభవం చేకూర్చాయి. ముఖ్యంగా జాతర ప్రాంతంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండసాగింది. ప్రతి ఒక్కరూ అమ్మవార్లను దర్శించుకుని వారి మనసులోని కోరికలను వ్యక్తం చేస్తూ సల్లంగా చూడాలి తల్లి అంటూ వేడుకున్నారు. కాగా, జాతరను విజయవంతం చేసిన భక్తులకు, అధికారులకు మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



చంద్రుగొండ: వనానికి తిరుగు పయనమైన దేవతలు

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



మొండికుంటలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఎస్సై తిరుపతిరావు

అశ్వాపురం: మద్యం సేదించి వాహనాలు నడపవద్దని ఎస్సై తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శనివారం ఎస్సై వాహన తనిఖీలు చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 90 శాతం ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే జరుగుతున్నాయని అన్నారు. ప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడపాలని హెల్మెట్లు, సీట్ బెల్టు తప్పక ధరించాలన్నారు. వాహనదారులు ధ్రువపత్రాలు ఉండాలన్నారు.

హామీలను అమలు చేయాలి



వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దమ్మపేట: కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు మోరంపూడి పాండురంగారావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ముష్టిబండ గ్రామంలో ఉడతనేని వెంకట్రావు వర్ధంతి సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు పాండురంగారావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు విస్మరించాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, కొలికపోగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని శనివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బంజారా నాయకులు, పార్టీల బాధ్యులు పాల్గొని సేవాలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. బంజారాల అభివృద్ధికి సేవాలాల్ మహరాజ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కొన్నిచోట్ల ర్యాలీలు తీశారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా గోధుమ రవ్వ, నెయ్యి, జీడిపప్పుతో నైవేధ్యాన్ని భక్తిశ్రద్ధలతో తయారు చేసి, హోమగుండంలో వేసి సేవాలాల్ మహారాజ్‌కు అర్పించారు. - సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పూజలు చేస్తున్న గిరిజనులు



గుండాల: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు



సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శంకర్ నాయక్